సంచలన దినపత్రిక
# హంస కలం వార్త
PRGI :T/TG/2026/0126/4786/1242
తెలంగాణ - ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక :34 ,చీఫ్ ఎడిటర్ : వడ్లే మధుసూదన్ చారి,వెల రూ. 4/-. బుధవారం 18-02-2026

రిపోర్టర్లు కావలెను
రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన సెల్ నెంబర్
9346255044
9966555449
హంస కలం

బిల్ గేట్స్‌తో మళ్లీ సమావేశం కావడంపై

## సీఎం చంద్రబాబు స్పందన

1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిశానని వెల్లడి





అప్పుడు ఐటీ విజన్.. ఇప్పుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంపై చర్చించామని వివరణ

అమరావతి సచివాలయంలో నా విజన్‌ను ఆయనకు వివరించానన్న చంద్రబాబు

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తామని ఉద్ఘాటన

అమరావతి: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త బిల్ గేట్స్ సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. మిగతా..2లో




## కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారే సంపూర్ణ నాయకులు

2లో

- జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పవన్ కల్యాణ్
- కార్యకర్తల బీమాకు రూ.2 కోట్ల విరాళం
- జనసేన తొలి సభ్యత్వం తీసుకొని, నమోదును ప్రారంభించిన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్

# "హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?"

## చంద్రబాబును ఆత్మీయంగా పలకరించిన బిల్ గేట్స్

2లో

- అమరావతి పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు ఆత్మీయ స్వాగతం
- ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శించి టెక్నాలజీ వినియోగంపై గేట్స్ ప్రశంసలు
- స్వర్ణాంధ్ర విజన్ 2047పై ప్రజెంటేషన్.. కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- 1997 నాటి తమ స్నేహాన్ని, హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ ఏర్పాటును గుర్తు చేసుకున్న వైనం




అమరావతి: "హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?" అంటూ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆత్మీయంగా పలకరించారు. ఇద్దరు పాత మిత్రుల కలయికతో అమరావతి సచివాలయంలో సోమవారం సందడి వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కీలక భాగస్వామ్యంపై చర్చించేందుకు రాష్ట్ర పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు, మిగతా..2లో

ఏడింట 5 కార్పొరేషన్‌లు

# కాంగ్రెస్ కైవసం..

## 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

- ★ రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండలను దక్కించుకున్న కాంగ్రెస్
- ★ కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ విజయం
- ★ జనగాం, తొర్రూర్, క్యాతనపల్లి, జహీరాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా




హైదరాబాద్: తెలంగాణలో ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. బీజేపీ, సీపీఐ పార్టీలు చెరో కార్పొరేషన్‌ను దక్కించుకున్నాయి. రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ, కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ దక్కించుకున్నాయి. మిగతా..2లో



## పదవులపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- పదవులు శాశ్వతం కాదన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- తనకు నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమన్న రాజగోపాల్ రెడ్డి
- తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని వ్యాఖ్య

తెలంగాణలోని 7 కార్పొరేషన్‌లలో...

## మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే




- కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, నల్గొండ మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి
- కొత్తగూడెం మేయర్‌గా మూడ్ గణేశ్.. రెండున్నరేళ్ల పాటు పదవిలో ఉండనున్న గణేశ్
- మజ్లిస్ సహకారంతో నిజామాబాద్‌ను దక్కించుకున్న కాంగ్రెస్

## 18 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

24న ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 26న రథోత్సవం..


2లో

అన్ని అలంకార సేవల్లో పాల్గొనేందుకు రూ.20 వేల టికెట్

విలేకరుల సమావేశంలో వెల్లడించిన ఆలయ ఈవో భవానీ శంకర్

## బంగారం ధర రూ.లక్ష కంటే తక్కువకు..?



2లో

తులం గోల్డ్ రేటు లక్ష రూపాయల కంటే తక్కువకు చేరుకుంటుందని పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్లో కూడా ఔన్సు ధర 3000 డాలర్లకు చేరుకుంటుందని వెల్లడించారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు

# రేవంత్ సర్కార్ సై..?

## మంత్రులతో సీఎం కీలక చర్చలు..

హంగ్ వచ్చిన స్థానాలపై ఫోకస్ పెట్టాలి

అన్ని మున్సిపాలిటీలపై హస్తం జెండా ఎగురవేయాలి




హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి రాజకీయ వ్యూహాలపై మిగతా..2లో

# ఉండవల్లిలో అరటితోటను సందర్శించిన బిల్ గేట్స్...

- ఏపీ వ్యవసాయంలో టెక్నాలజీని చూసి ఆశ్చర్యం
- సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ క్షేత్రస్థాయిలో పర్యటన
- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పరిశీలన
- టెక్నాలజీ వాడుతున్న రైతులను అభినందించిన సీఎం
- ఏఐతో రైతులకు సలహాలు అందిస్తున్నామని వెల్లడి



అమరావతి: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన ఉండవల్లిలోని అరటి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మిగతా..2లో

తిరుమల శ్రీవారి మే నెల దర్శన కోటా..

## తేదీల వారీగా పూర్తి షెడ్యూల్ ఇదే!


2లో

మే నెల శ్రీవారి దర్శన టికెట్ల కోటా విడుదల షెడ్యూల్

ఫిబ్రవరి 18న ఆర్జిత సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ ప్రారంభం

## నల్గొండను దేశం గర్వించేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం: కోమటిరెడ్డి



నల్గొండ మేయర్, డిప్యూటీ మేయర్లకు కోమటిరెడ్డి అభినందనలు

తన మనసు గర్వంతో నిండిపోయిందని వ్యాఖ్య

ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తామన్న మంత్రి

హైదరాబాద్: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లను ఈరోజు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన జీవిత కల అని భావోద్వేగంతో చెప్పుకొచ్చారు. మిగతా..2లో

### "గ్రేట్ వర్క్"... ఏపీ ప్రభుత్వంపై

# బిల్ గేట్స్ ప్రశంసలు

అమరావతి: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్ ను సీఎం చంద్రబాబుతో కలిసి సందర్శించారు. ఆర్టీజీఎస్ సెంటర్‌లో ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సాప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం వంటి అంశాల గురించి బిల్ గేట్స్ కు చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ... డేటా లేక్ ద్వారా అన్ని శాఖలను అనుసంధానం చేయడం, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడం చాలా బాగుందని ప్రశంసించారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్ సమాచారం సేకరించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరు, కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్‌డీపీ పెరుగుదలను అంచనా వేస్తున్న విధానం కూడా గేట్స్‌ను ఆకట్టుకున్నాయి. ఆర్టీజీఎస్ లోని డిస్ ప్లే వాల్స్ పై ప్రెజెంటేషన్లను ఆయన పరిశీలించారు. ప్రాపర్టీ రికార్డుల భద్రత కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి విధానాలు అమలు చేస్తున్న తీరును గేట్స్ ప్రశంసించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు సేకరించి ప్రజలకు సలహాలు ఇస్తున్న విధానాన్ని "గ్రేట్" అని కొనియాడారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్ లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలను తీసుకుంటున్నట్టు బిల్ గేట్స్ కు చంద్రబాబు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా... బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో రికార్డులను భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ఆయనకు వివరించారు. అమరావతి నిర్మాణ వివరాలను కూడా ఆసక్తిగా తెలుసుకున్న బిల్ గేట్స్ "గ్రేట్ వర్క్" అంటూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

### ఏం మారినా టీమిండియా

## గెలుపు మాత్రం స్థిరం: అమిత్ షా

ఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. టీమిండియా అద్భుతంగా ఆడిందంటూ కితాబిచ్చారు. ఫార్మాట్లు, వేదికలు, తేదీలు మారినా పాకిస్థాన్‌పై టీమిండియా గెలుపు మాత్రం స్థిరంగా ఉంటోందని పేర్కొన్నారు. టీమిండియాకు ఆయన అభినందనలు తెలియజేశారు. పాకిస్థాన్‌పై విజయం సాధించిన టీమిండియాకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్థాన్‌పై ప్రశాంతంగా, ధైర్యంగా భారత జట్టు 61 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించిందని అన్నారు. టీ20 మ్యాచ్‌లలో పాకిస్థాన్‌పై భారత్ విజయాలు 8-1కి చేరుకోవడం గొప్ప విషయమని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు. భారత జట్టు కలిసికట్టుగా అద్భుతమైన ప్రదర్శన కనబరిచిందని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ అన్నాడు. వారి ప్రదర్శన గర్వకారణమని పేర్కొన్నాడు. టీమిండియాలోని ప్రతి ఆటగాడు ప్రశాంతంగా, బలంగా తమ పాత్రను పూర్తి చేశారని ప్రశంసించారు.

## మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

బీహార్ : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీ-జేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## బంగారం ధర రూ.లక్ష కంటే తక్కువకు..?

ఢిల్లీ: బంగారం కొనాలంటేనే భయపడుతున్న సమయంలో.. నిపుణులు పసిడి ప్రియులకు శుభవార్త చెప్పారు. తులం గోల్డ్ రేటు లక్ష రూపాయల కంటే తక్కువకు చేరుకుంటుందని పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్లో కూడా ఔన్సు ధర 3000 డాలర్లకు చేరుకుంటుందని వెల్లడించారు. రష్యా అమెరికాతో వ్యాపారం చేయడం ప్రారంభిస్తే ఇది సాధ్యమవుతుందని అన్నారు. 2025లో భారీగా పెరిగిన గోల్డ్ రేటు.. 2026 జనవరిలో కూడా అదే రీతిగా ముందుకు సాగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల ధర రూ.1.80 లక్షల స్థాయికి చేరింది. కాగా గత వారంలో ఎంసీఎక్స్ బంగారం ధర రూ. 1.56 లక్షల (10 గ్రామ్స్) వద్ద నిలిచింది. దీన్నిబట్టి చూస్తే.. ఇప్పుడు పరిస్థితులు కొంత చక్కబడ్డాయని, బంగారం ధరలు స్వల్ప తగ్గుదలను నమోదు చేశాయని తెలుస్తోంది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రష్యా అమెరికాతో డాలర్లలో (ఋణ) వ్యాపారం చేయడానికి తిరిగి వస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా.. రష్యన్ అంతర్జాతీయ డాక్యుమెంట్ క్రెమ్లిన్.. అమెరికాతో ఆర్థిక భాగస్వామ్యాన్ని అన్వేషిస్తోందని సూచిస్తోంది. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన భాగం మాస్కో యుఎస్ డాలర్ ఆధారిత వాణిజ్య ఒప్పందానికి తిరిగి రావడం. ఇది రష్యాతో సహా బ్రిక్స్ దేశాల డీ-డాలరైజేషన్ ప్రయత్నాలకు పెద్ద దెబ్బ అవుతుంది.

రష్యా అంతర్జాతీయ వాణిజ్యాన్ని డాలర్లతో నిర్వహిస్తే.. డాలర్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోలు చేయడం కొంత తగ్గిస్తాయి. ఇవన్నీ బంగారం రేటును గణనీయంగా తగ్గించడంలో దోహదపడతాయి.

భారతదేశంలో నేటి బంగారం ధరలు

ఇండియన్ మార్కెట్లో ఈ రోజు (ఫిబ్రవరి 16) బంగారం ధరలు రూ. 1000 కంటే ఎక్కువ తగ్గాయి. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లోని పసిడి ధరల్లో మార్పులు జరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1.56 లక్షల వద్ద, 22 క్యారెట్స్ తులం బంగారం ధర రూ. 1.43 లక్షల వద్ద ఉన్నాయి.

# ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

మొదటి పేజి తరువాయి

రామగుండం, మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్గొండలలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చింది. నిజామాబాద్ కార్పొరేషన్ బీజేపీకి అవకాశాలు ఉన్నప్పటికీ, మజ్లిస్ పార్టీ మద్దతుతో దీనిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా 49వ వార్డు కార్పొరేటర్ ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా మజ్లిస్ పార్టీ 54వ వార్డు కార్పొరేటర్ సల్మా తహసీన్ ఎన్నికయ్యారు.

11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా

కోరం లేకపోవడం వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. జనగాం, తొర్రూరు, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్ నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్ మున్సిపాలిటీలలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు.

## కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారే సంపూర్ణ నాయకులు

అమరావతి: క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారు.. పార్టీ ఉన్నతి కోసం ఉద్యమి, సాధక్, ప్రదాతలుగా మారి పనిచేసేవారే సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలి సభ్యత్వం తీసుకున్నారు. కార్యకర్తల బీమా కోసం రూ.2 కోట్ల చెక్కును పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఐదోవిడత క్రియాశీలక సభ్యత్వ నమోదు మొదలవుతుందని.. పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం వారం ముందే ప్రారంభమవుతుందని పవన్ కల్యాణ్ తెలిపారు. 'తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలిచారు. ఇది చిన్న గెలుపే అయినా మార్పునకు బలమైన సంకేతం. ఏపీకి చెందిన పార్టీ తెలంగాణలో పోటీ చేయడమేంటని కొందరు విమర్శించినా.. జనసైనికులే వారి మాటల్ని తిప్పికొట్టారు. బాధ్యతాయుతమైన యువతను నాయకత్వం దిశగా తీసుకెళ్లడమే మా లక్ష్యం. అందులోభాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో దివ్యాంగురాలైన నీత, చెప్పులు కుట్టుకునే సత్యనగేశ్, అంధుడైన కల్యాణ్ వెంకటేశ్‌కు పోటీచేసే అవకాశం లభించింది' అని వివరించారు.

ఉద్యమి.. సాధక్.. ప్రదాత: 'క్రియాశీలక సభ్యుడు, వాలంటీర్ అనే పదాలు పెద్దగా నచ్చలేదు. దృఢచిత్తంతో, కార్యసాధనలో ఎదురయ్యే ఒడుదొడుకుల్ని తట్టుకుని పట్టు వదలకుండా ముందుకు కదిలేవారిని ఉద్యమి అంటారు. ఇకనుంచి సభ్యత్వం తీసుకునే వారిని 'ఉద్యమి' అనే గౌరవప్రదమైన పేరుతో పిలుద్దాం. క్షేత్రస్థాయిలో తన పరిధిలోని సమూహంలో ప్రేరణ కలిగించి.. పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితుల్ని చేసి ఉద్యమిలుగా తయారుచేసే బాధ్యత తీసుకునే వారికి 'సాధక్' అనే పేరు నిర్ణయించాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. 'జనసేన అంటే అంతులేని అభిమానం, పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం, నాయకత్వంపై నమ్మకం ఉన్నా.. ఎంతోమంది తమకున్న పరిమితుల వల్ల రాజకీయాల్లోకి క్రియాశీలకంగా రాలేకపోవచ్చు. పదవి ఆశించకుండానే... పార్టీకి అండగా నిలుస్తూ, సభ్యులకు తోడ్పాటు అందిస్తారు. ఇలాంటివారికి 'ప్రదాత' అనే పేరుతో సముచిత గౌరవం, గుర్తింపు ఇస్తున్నాం' అని వివరించారు. క్రియాశీలక సభ్యత్వాన్ని ఉద్యమి మెంబర్‌షిప్‌గా ప్రకటిస్తున్నామన్నారు.

13 లక్షలకు చేరిన సభ్యత్వం: '2020 సంవత్సరంలో క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90వేలు నమోదు చేశాం. ఎన్నికలకు ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు నమోదు చేశాం. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని గుర్తించేలా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కూటమిలో ప్రధాన భాగస్వామ్య పక్షంగా.. ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలి' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేర్పించినవారితో పవన్ కల్యాణ్ కొద్దిసేపు మాట్లాడారు. పేరుపేరునా పలకరిస్తూ స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్, జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# "హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?"

మొదటి పేజి తరువాయి

బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘన స్వాగతం పలికారు. సచివాలయం మొదటి బ్లాకు వద్ద చంద్రబాబును చూడగానే బిల్ గేట్స్ స్నేహపూర్వకంగా ముందుకు వచ్చి ఆయన్ను పలకరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు, గన్నవరం విమానాశ్రయం చేరుకున్న బిల్ గేట్స్‌కు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, సత్యకుమార్‌లతో పాటు కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘనంగా స్వాగతం పలికారు. సచివాలయానికి చేరుకున్న అనంతరం చంద్రబాబు తన మంత్రివర్గ సహచరులను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు పరిచయం చేశారు.

టెక్నాలజీతో పాలనపై బిల్ గేట్స్ ప్రశంసలు

సమావేశానికి ముందు సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించారు. పాలనలో టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్ వంటి వినూత్న విధానాల ద్వారా పౌర సేవలను వేగంగా అందిస్తున్న తీరును చంద్రబాబు ఆయనకు వివరించారు. ముఖ్యంగా, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భూ రికార్డులను భద్రపరచడం, ట్యాక్స్ కలెక్షన్ ప్రక్రియ అద్భుతంగా ఉన్నాయని బిల్ గేట్స్ ప్రశంసించారు. తమ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా కుప్పంలో నడుస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకుని, "దట్స్ నైస్" అంటూ అభినందించారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మెరుగుపరుస్తున్నామని సీఎం చెప్పగా, "గ్రేట్" అంటూ కితాబిచ్చారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ ప్రణాళికలో 30 శాతం పచ్చదనం, జల వనరులకు కేటాయించడం బాగుందని, ఇది "గ్రేట్ వర్క్" అని కొనియాడారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047.. వ్యూహాత్మక భాగస్వామ్యం

అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర విజన్ 2047'పై బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇచ్చారు. 1997లో తాను తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసినప్పటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని, ఆయన సహకారంతో హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు జరిగిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. "నాడు మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలిచింది. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో సంపద సృష్టి జరగాల్సి ఉంది. బిల్ గేట్స్ సహకారంతో వ్యవసాయం, ప్రజారోగ్యం, టెక్నాలజీ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం" అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు వంటి నగరాలను అభివృద్ధి చేసే ప్రణాళికలను వివరించారు. విద్య, వైద్య రంగాల్లో సాంకేతికతను జోడించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. బిల్ గేట్స్ పర్యటన చారిత్రాత్మకమని, ఇది రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని సీఎం అన్నారు.

### బిల్ గేట్స్‌తో మళ్లీ సమావేశం కావడంపై

## సీఎం చంద్రబాబు స్పందన

మొదటి పేజి తరువాయి

అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొని, రాష్ట్ర ప్రాధాన్యతా రంగాలపై బిల్ గేట్స్‌కు వివరించారు. ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 1997లో తాను తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ రంగానికి సంబంధించిన తన విజన్‌ను పంచుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "1997లో నేను తొలిసారి మిస్టర్ బిల్ గేట్స్‌ను కలిశాను. అప్పుడు ఆయనకు నా ఐటీ విజన్‌ను వివరించాను. ఆ రోజు ఒక టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంపై మా మధ్య మొదలైన సంభాషణ, ఇప్పుడు ఒక విస్తృత లక్ష్యంగా రూపాంతరం చెందింది. వినూత్న ఆవిష్కరణలను ఉపయోగించి పాలనలో మార్పులు తీసుకురావడం, ప్రజల జీవితాలను పెద్ద ఎత్తున మెరుగుపరచడమే ఆ లక్ష్యం. అమరావతి సచివాలయంలో ఆయనతో మరోసారి భేటీ అయ్యాను. ఈ సందర్భంగా, నా స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆయన ముందు ఉంచాను. ఈ సమావేశంలో మా మంత్రులు, కార్యదర్శులు కూడా పాలుపంచుకుని ఆయనతో సంభాషించారు. మా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాం. రాష్ట్ర ప్రజలకు సాధికారత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏయే మార్గాల్లో పనిచేయవచ్చో అన్వేషించాం. ఆనాటి మా సంభాషణ నేటి మా విస్తృత లక్ష్యాలకు పునాది వేయడం సంతోషంగా ఉంది" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

### ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు

# రేవంత్ సర్కార్ సై..?

మొదటి పేజి తరువాయి

రాజకీయ వ్యూహాలపై ముఖ్యమంత్రి మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన రేవంత్.. హంగ్ వచ్చిన స్థానాలపై ఫోకస్ పెట్టాలని మంత్రులకు సూచించారు. మేయర్, ఛైర్మన్ ఎన్నికల నాటికి ఎక్స్ అఫిషియో ఓట్ల వినియోగం ద్వారా అన్ని మున్సిపాలిటీలపై హస్తం జెండా ఎగురవేయాలని మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. కొన్ని చోట్ల ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించారు. అంతేకాకుండా ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, రైతులకు ఇచ్చే ఆర్థిక సాయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.

### స్థానిక పోరుకు సై?

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో అదే ఊపును కొనసాగించాలని సీఎం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను తక్షణమే నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అంశంపై మంత్రుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పార్టీ పట్టును మరింత బలోపేతం చేసేందుకు ఇదే సరైన సమయమని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్ ఇచ్చే దిశగా అడుగులు వేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.

రైతులకు తీపి కబురు

ఈ సమావేశంలో రైతు భరోసాపై మంత్రులతో రేవంత్ చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధులను ఈనెల 17న విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన నిధుల సర్దుబాటు, లబ్ధిదారుల ఎంపికపై సీఎం అధికారులకు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత రైతులకు ఈ ఆర్థిక సాయం అందించడం ద్వారా గ్రామీణ ఓటర్లలో మరింత విశ్వాసం నింపవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

# ఉండవల్లిలో అరటితోటను సందర్శించిన బిల్ గేట్స్...

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఏపీ ప్రభుత్వం వినియోగిస్తున్న ఆధునిక టెక్నాలజీని, దాని పనితీరును సీఎం చంద్రబాబు ఆయనకు వివరించారు. ఉండవల్లికి విచ్చేసిన బిల్ గేట్స్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రదర్శించి చూపించారు. అరటి తోటలో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేసే విధానాన్ని బిల్ గేట్స్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, తమ రైతులు సంప్రదాయాలను గౌరవిస్తూనే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందున్నారని, ఇది తనకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. "ఈ విషయాన్నే ఇవాళ ఉండవల్లిలో మిస్టర్ గేట్స్‌తో పంచుకున్నాం. పంటలు, మార్కెట్ ధరలు, నేల స్వభావం ఆధారంగా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రైతులకు కచ్చితమైన సలహాలు అందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని, సుస్థిర వ్యవసాయ పద్ధతులను కూడా చురుకుగా ప్రోత్సహిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అక్కడి రైతులను అభినందించారు.

## నల్గొండను దేశం గర్వించేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం: కోమటిరెడ్డి

మొదటి పేజి తరువాయి

నూతన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. నల్గొండ తన జన్మభూమి అని కోమటిరెడ్డి అన్నారు. నల్గొండలోని ప్రతి గల్లీ తన గుండెచప్పుడు అని చెప్పారు. ఈరోజు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం చేస్తుంటే... తన మనసు ఎంతో గర్వంతో నిండిపోయిందని అన్నారు. నల్గొండను దేశం గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. "రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరేలా చూడడమే నా బాధ్యత" అని మంత్రి ప్రకటించారు. "నాటి ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుంచి నేటి స్మార్ట్ సిటీ నిర్మాణం వరకు... మీ కోమటిరెడ్డి ఎప్పుడూ మీ తోడుగానే ఉంటాడు. మనందరం కలిసి నవ నల్గొండను నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు.

### తిరుమల శ్రీవారి మే నెల దర్శన కోటా..

## తేదీల వారీగా పూర్తి షెడ్యూల్ ఇదే!

తిరుపతి: తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ప్రకటన చేసింది. 2026 మే నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసేందుకు తేదీల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది.

తేదీల వారీగా కోటా విడుదల వివరాలు:

ఫిబ్రవరి 18: సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ ప్రక్రియ ఫిబ్రవరి 18న ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. భక్తులు ఫిబ్రవరి 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన వారు ఫిబ్రవరి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి 21: కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను అందుబాటులోకి తేనున్నారు.

ఫిబ్రవరి 23: ఈ రోజున మూడు వేర్వేరు కోటాలను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

ఫిబ్రవరి 24: భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు.

ఫిబ్రవరి 27: ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు తమకు కావాల్సిన సేవలు, దర్శన టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

### తెలంగాణలోని 7 కార్పొరేషన్‌లలో...

## మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే

హైదరాబాద్: తెలంగాణలో ఏడు కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాలను గెలుచుకోగా, బీజేపీ కరీంనగర్ మేయర్ పదవిని కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో రెండు పార్టీలు అవగాహన కుదుర్చుకున్నాయి. మొదటి రెండున్నరేళ్లు మేయర్ పదవి సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని నిర్ణయించాయి. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ పార్టీ సహకారంతో నిజామాబాద్ మేయర్ పదవిని దక్కించుకుంది. మొదటి నుంచి ఉత్కంఠ రేపిన కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి దక్కింది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు 22 స్థానాల చొప్పున గెలిచాయి. ఇక్కడ బీఆర్ఎస్ 8 సీట్లు గెలుచుకుంది. సీపీఐకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేషరతుగా మద్దతు ప్రకటించినప్పటికీ, సీపీఐ మాత్రం రొటేషన్ పద్ధతిలో మిత్రపక్షం కాంగ్రెస్ పార్టీతో నడిచేందుకు మొగ్గు చూపింది.

కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే

1. కరీంనగర్ కార్పొరేషన్ - మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ), డిప్యూటీ మేయర్: సునీల్ రావు (బీజేపీ). 2. నిజామాబాద్ కార్పొరేషన్ - మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మా తహసీన్ (మజ్లిస్) 3. రామగుండం కార్పొరేషన్ - మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపెల్లి ఎల్లయ్య (కాంగ్రెస్) 4. కొత్తగూడెం కార్పొరేషన్ - మేయర్: మూడ్ గణేశ్ (సీపీఐ), డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్) 5. నల్గొండ కార్పొరేషన్ - మేయర్: బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ 6. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ - మేయర్: గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సురేందర్ రెడ్డి (కాంగ్రెస్), 7. మంచిర్యాల కార్పొరేషన్ - మేయర్: మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: రమ్య మహేశ్ (కాంగ్రెస్).

## పదవులపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

మునుగోడు: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, తన నియోజకవర్గం అభివృద్ధి తనకు ముఖ్యమని ఆయన అన్నారు. తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తే చాలని అన్నారు. కాగా, రాజగోపాల్ రెడ్డి ఇటీవలి వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. తనకు మంత్రి పదవి ఇవ్వాలని, ఆ హామీతోనే తాను పార్టీలోకి వచ్చానని ఆయన ఇటీవల వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని లేదంటే ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అడగబోనని, కానీ తనకూ ఒకరోజు వస్తుందని, ఆ రోజు లాక్కుంటానని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఒక్కరే కష్టపడితే కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, పార్టీలోని వారంతా శ్రమించారని అన్నారు. అయితే, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## 18 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: ఈ నెల 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భవానీ శంకర్ వెల్లడించారు. యాదగిరికొండపైన ప్రధాన కార్యా లయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధా నార్చకులు కాండూరి వెంకటాచార్య లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు యాదగిరీశుడి క్షేత్రంలో కొనసాగుతా యన్నారు. 18న ఉదయం విష్వక్సేన ఆరాధన, స్వస్తి వాచనం, రాత్రి అంకురార్పణతో ఉత్సవాలను అర్చకులు పాంచ రాత్ర ఆగ మశాస్త్రా నుసారంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 20న ఉద యం 9గంటలకు మత్స్యాలంకారంతో అలంకార సేవలు ప్రారంభం అవుతాయని తెలిపారు. 24న రాత్రి 8 నుంచి 8.45 గంటల వరకు ఆలయ తూర్పు మాడ వీధిలో శ్రీస్వామి అమ్మవార్లకు ఎదు ర్కోలు ఉత్సవం జరుగుతుందన్నారు. 25న రాత్రి శ్రీస్వామి అమ్మ వార్ల తిరుకల్యాణ మహోత్సవం ఆలయ ఉత్తర మాడ వీధిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 26న దివ్య విమాన రథోత్సవం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవు తుందన్నారు. 27న విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థ స్నానం, 28న ఉదయం 10గంటలకు అష్టో త్తర శత ఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. 100 మంది యజ్ఞాచార్యులు, పారాయ ణీకులు, రుత్వికులు ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఆలయ సంప్రోక్షణ నేపథ్యంలో దర్శనాలు కొంత సమయం నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్త దంపతులు పాల్గొనేందుకు రూ. 20వేల రుసుము చెల్లిస్తే అన్ని సేవల్లో పాల్గొనే అవకాశంతో పాటు అంతరాలయ దర్శనం, అభిషేకం లడ్డూ, కనుమ, శ్రీస్వా మి శెల్లా ఇస్తామన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దేవస్థానం ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముందుకు వెళ్తున్నామని ఈవో వెల్లడించారు.

## ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తీసుకొస్తోంది

ఉండవల్లి: మానవజీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని చెప్పారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. " 1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివృద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన సంగతి తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు.

## ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత చేరువలో ఉండేవారు: బిల్ గేట్స్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో నవ్యాంధ్రకు కొత్త దశ-దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. బిల్ గేట్స్ రాకను చారిత్రాత్మకమని అభివర్ణించిన సీఎం, ఈ భాగస్వామ్యం రాష్ట్ర ప్రజల సాధికారతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన నాటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్, భారత డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తాను తొలిసారి చంద్రబాబును కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లోని ముందుచూపును గ్రహించానని వెల్లడించారు. ఆ రోజుల్లో ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత సమీపంలో ఉండేవారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఈ స్థాయిలో వినియోగించడం లేదని, కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం గొప్ప పరిణామమని అభినందించారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు నాయకత్వం వహించాలి...!

**నూతన సర్పంచులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, **ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** గ్రామాల సమగ్రాభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామపంచాయతీ సర్పంచులకు విడతల వారీగా శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండవ విడత శిక్షణ కార్యక్రమం 17 ఫిబ్రవరి నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.రెండవ విడతలో భాగంగా అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది నూతన సర్పంచులు శిక్షణలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాలు, బాధ్యతలు, కర్తవ్యాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని అన్నారు.శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయతీలకు అందుతున్న అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించి తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని సర్పంచులు నిరంతరం పర్యవేక్షించి చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేదో పరిశీలించాలని సూచించారు. అక్షరాస్యత పెంపు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.జిల్లాలో ఉన్న పర్యాటక అవకాశాలను సద్వినియోగం చేసుకుని గ్రామాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇల్లందు పూబెల్లి, రోళ్ళపాడు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల్లోని కారుకొండ, జూలూరుపాడు ప్రాంతంలోని వ్యవసాయ విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేస్తే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందే అవకాశముందని తెలిపారు.సర్పంచులు పంచాయతీ శాఖకే పరిమితం కాకుండా గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఇప్ప, ఇప్పపువ్వు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామస్తులకు అదనపు ఆదాయ వనరులు సృష్టించవచ్చని, పశుసంపద అభివృద్ధి, మేత సంపద పెంపుతో ప్రభుత్వ సబ్సిడీలుగ్రామాల్లో పొందే అవకాశముందని వివరించారు.18 నుండి 20 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా యంత్రాంగం నిర్వహించే ఇంటర్వ్యూలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి యువతను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సర్పంచులను కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సర్పంచులకు శిక్షణ కిట్లను అందజేశారు. గ్రామ పాలనకు అవసరమైన మార్గదర్శక పుస్తకాలు, చట్టపరమైన సూచనలు, అభివృద్ధి పథకాల సమాచార పత్రాలు తదితర అంశాలు కిట్లలో అందజేయబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్టీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

**ధ్వజారోహణంకు హాజరైన టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు**



**ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం ఉదయం 10.30 గం.లకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి, ప్రత్యేక పూజలు చేపట్టి ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. 18 గణాలను , ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్షణం. కంకణబట్టార్ గా శ్రీ పి.కృష్ణసాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :

తేదీ 17-02-2026
ఉదయం -- ధ్వజారోహణం ( మేష లగ్నం -- ఉ. 10.30 -- 11.00 గంటల వరకు)
రాత్రి -- పెద్దశేష వాహనం

18-02-2026
ఉదయం -- చిన్నశేష వాహనం
రాత్రి -- హంస వాహనం

19-02-2026
ఉదయం -- సింహ వాహనం
రాత్రి -- ముత్యపుపందిరి వాహనం

20-02-2026
ఉదయం -- కల్పవృక్ష వాహనం
రాత్రి -- సర్వభూపాల వాహనం

21-02-2026
ఉదయం -- పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం)
రాత్రి -- గరుడ వాహనం (రాత్రి 07.00 గం.ల నుండి 09.00 గం.ల వరకు)

22-02-2026
ఉదయం -- హనుమంత వాహనం
రాత్రి -- గజ వాహనం

23-02-2026
ఉదయం -- సూర్యప్రభ వాహనం
రాత్రి -- చంద్రప్రభ వాహనం

24-02-2026
ఉదయం -- రథోత్సవం
రాత్రి -- అశ్వవాహనం

25-02-2026
ఉదయం -- చక్రస్నానం(ఉ. 08.00 నుండి 10.00 గంటల వరకు)
రాత్రి -- ధ్వజావరోహణం( సా. 6 నుండి రాత్రి 8 గంటల వరకు)

26.02.2026.
మధ్యాహ్నం 03.00 గం.లకు పుష్పయాగం .



జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా టిటిడి పటిష్ట చర్యలు చేపట్టింది. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని కోరారు. చలువ పందిళ్ళు, క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, పటిష్ట సెక్యూరిటీ ఏర్పాటు చేసారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనసేవల ముందు కోలాటాలు, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్వామి వారి వాహన సేవలను శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, జూబ్లీహిల్స్ ఎస్వీ ఆలయ ఎల్.ఏ.సి ప్రెసిడెంట్ శ్రీ ఏ. వి. రెడ్డి, ఏఈవో శ్రీ రమేశ్, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ శ్రీ నిరంజన్, శ్రీ హరికృష్ణ, పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు. టిటిడి ప్రధాన ప్రజా సంబంధాల అధికారిచే విడుదల చేయబడినది.

# చౌటుప్పల్ పట్టణంలో కెసిఆర్ జన్మదిన వేడుకలు.

**నేటి వార్త చౌటుప్పల్ డివిజన్ ప్రతినిధి దోర్నాల గజేందర్ నేత**

**గంగాదేవి శివ చౌటుప్పల్ మండలం టిఆర్ఎస్వి నాయకులు**





**ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** ఈరోజు మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మండలం చౌటుప్పల్ మున్సిపల్ దీ=ాాం ఆధ్వర్యంలో. తెలంగాణ జాతిపిత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. గారి జన్మదిన వేడుకలు సందర్భంగా. చౌటుప్పల్ మున్సిపల్ ్గ్నూా. స్కూల్ ల్లో కేక్ కటిగ్ చేసి పండ్లు పంపిణీ చేయడం జరిగినది.. ఇందులో.దీ=ాాం మండల నాయకులు గంగాదేవి శివ.. చౌటుప్పల్ మున్సిపల్ దీ=ాాం నాయకులు ఊదరి రాకేష్.. మండల నాయకులు. గట్టు హరిసుందర్. చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు ఎండి అంతు మీసాల సుమంత్. సలహాద్రి చరణ్ . గంజి మానిక్ ఇతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడి ప్రజల కలలను సాకారం చేసిన మహానేత కేసీఆర్ గారేనని కొనియాడారు. తెలంగాణ కోసం చేపట్టిన దీక్షలు, ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కేసీఆర్ దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో విశేష అభివృద్ధి సాధించిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా, కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారని వివరించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని తెలిపారు. కేసీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త బాధ్యత అని పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన ధ్యేయమని అన్నారు.

# క్రీడా మరియు సాంస్కృతిక మహోత్సవం ఘనంగా నిర్వహణ...



**కరీంనగర్ జిల్లా స్టాపర్ ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ లో ప్రిన్సిపల్ శ్రీ వి.సత్య వర్ధన్ రావు గారి ఆధ్వర్యంలో క్రీడా మరియు సంస్కృత ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ గంగాధర్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని తమ తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచన చేయడం జరిగినది .అనంతరం రాష్ట్రస్థాయి మరియు కళాశాల స్థాయిలలో వివిధ క్రీడా రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మరియు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ ఏ.నిర్మల రమణాచారి, సిహెచ్ శశిధర్ శర్మ సూపరిండెంట్ట్ బల్బీర్ సింగ్ అధ్యాపకులు సత్యనారాయణ రెడ్డి, కళాశాల సీనియర్ అధ్యాపకురాలు వి.ప్రమీల గారూ మరియు కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కమ్మర్పల్లి మండల**ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ 2026- 2027 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని మంగళవారం రోజున అందరి బ్యాడ్మింటన్ కార్యవర్గ సభ్యుల అభిప్రాయంతో ఏకగ్రీవంగా కమ్మర్పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు జరిగింది. కమ్మర్పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులుగా లుక్క గంగాధర్, ఉపాధ్యక్షులుగా భోగా శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి పవన్ కుమార్, కోశాధికారిగా చి లివేరి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కొమ్ముల శ్రీనివాస్ ల తో నూతన కార్యవర్గం ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు లుక్క గంగాధర్, తోపాటు కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, కమ్మర్పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ను అందరి సహకారంతో, సమన్వయంతో క్లబ్బును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని వారన్నారు. అంతేకాకుండా నిస్వార్థంతో సేవ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్లబ్ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



కురవి మహబూబాబాద్ జిల్లా **ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్నాక్స్ పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుండి కురవి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఎం డి వహీద్ గారు స్నాక్స్ పంపిణీ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉన్నతస్థాయిలో విద్యార్థులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాల శ్రీధర్, వెంపటి విజయ్ రాజ్, శ్యామలాదేవి, విజయలక్ష్మి, ద్రైద వెంకటేశ్వర్లు, బొందిలి వెంకన్న, గుండోజు నరసింహ చారి, బొంగాని మల్లికార్జునరావు పద్మలత ,రత్నమాల,బండి రవీందర్, బేతమల్ల ప్రేమ్ సాగర్, తాళ్లపల్లి యాకమ్మ,భూక్య బాలాజీ, రాగం వీరభద్రం,కళావతి,మల్లయ్య పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి శ్రీవారి ఆలయాన్ని సందర్శించిన కోకో కోల అధికారులు...!



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి **ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోనీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని కోకో కోల కంపెనీ ప్రతినిధులు( ఆర్.ఎస్.యం) నైనాల రామ్ కుమార్, (ఏ.ఎస్.యం) కుమార్ స్వామి,(ఏ.వో.యం) సత్య ప్రసాద్, (ఎగ్జిక్యూటివ్) శివరామకృష్ణ, మంగళవారం సందర్శించారు.ఈసందర్భంగా ఆలయంలోని కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ పరిసరా ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడ నెలకొని ఉన్న ఆధ్యాత్మిక వాతావరణానికి వారు సంతృప్తి చెందారు.ఆలయ విశేషాలు చరిత్ర కట్టడాలను తిలకించి మొదలగు అంశాలను తెలుసుకొని భక్తి పర్వశం లో మునిగిపోయారు. కంపెనీ ప్రతినిధులను ఆలయ ఈవో రమణ,అసిస్టెంట్ ఈవో సంపత్, ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మల్లెల నాని,మల్లెల సాయి,ఎన్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో వైభవంగా త్రిశూలస్నానం



తిరుపతి, **ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం త్రిశూలస్నానం వైభవంగా జరిగింది. ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు శ్రీ నటరాజ స్వామివారు సూర్యప్రభ వాహనంపై అన్నారావు సర్కిల్ వరకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం 9 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. కపిలేశ్వరస్వామివారి ఆయుధమైన త్రిశూలానికి స్నపన తిరుమంజనం నిర్వహించి శాంతి చేకూర్చారు. పూర్ణాహుతి, కలశోద్వాసనం, మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు ధ్వజావరోహణంతో శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. రాత్రి 8 నుండి 10 గంటల వరకు రావణాసుర వాహనసేవ జరుగనుంది. హరిబ్రహ్మాదులకే లభ్యం గాని పవిత్రపాదపద్మాలను హృదయ చక్రంలో నిలుపుకొని నిత్యం ధ్యానం చేసిన రాక్షసభక్తుడు రావణుడు. తపస్సంపన్నుడైన రావణుడు పరస్త్రీని చెరబట్టడమనే దుర్మార్గానికి పాల్పడటం, శిష్టులైన దేవతలకు హాని తలపెట్టడం వల్ల రామబాణానికి హతుడయ్యాడు. ఇలాంటి రావణుడిని వాహనంగా చేసుకుని శ్రీకపిలేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీ చంద్ర శేఖర్, ఆలయ అర్చకులు విశేషంగా భక్తులు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారిచే విడుదల చేయబడినది.

# వేలాల జాతరలో నిరంతరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



**జైపూర్ ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** మహాశివరాత్రి సందర్భంగా జైపూర్ మండలంలోని వేలాల గ్రామపంచాయతీలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు 15.02.2026 నుండి 17.02.2026 వరకు 3 రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.జాతరకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.జాతరకు హాజరవుతున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణకై జైపూర్ మండలం నుండి 17 మంది పంచాయతీ కార్యదర్శులు,భీమారం మండలం నుండి ఎనిమిది మంది పంచాయతీ కార్యదర్శులు అదేవిధంగా రెండు మండలాల నుండి సుమారు 100 మంది పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు.రెండు మండలాల నుండి సుమారుగా 20 గ్రామపంచాయతీ ట్రాక్టర్లు త్రాగునీరు,ఇతర అవసరాల కోసం వినియోగించడం జరుగుచున్నది. మంగళవారం మూడవరోజు కూడా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించడం జరుగుతున్నది.జాతరకు మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వరరావు జాతరకు విచ్చేసి పనులన్నిటిని పరిశీలించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.జాతర యందు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా పంచాయతీ అధికారి తోపాటు ఎంపీఓ శ్రీపతి బాపు రావు,జైపూర్,భీమారం మండలాల పంచాయతీ కార్యదర్శులు,పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.వేలాల మల్లన్న జాతరలో చాలా కష్టపడి హాజరైన భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం పట్ల,మంచినీటి సరఫరా పట్ల గుట్ట పైన మరియు గ్రామంలో రోడ్లపైన మల్లికార్జున స్వామి దేవస్థానం ముందు, గోదావరిలో అన్ని చోట్ల కూడా సక్రమంగా విధులు నిర్వహించిన జైపూర్,భీమారం మండల పంచాయతీ కార్యదర్శులను, రెవెన్యూ శాఖ సిబ్బంది జిపిఓ లను,కారోబార్లను,ఎంపీడబ్ల్యూ లను,పారిశుద్ధ్య కార్మికులను మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ,మండల రెవెన్యూ అధికారిని వనజా రెడ్డి,మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబురావు,వేలాల గ్రామ సర్పంచ్ దేగ స్వప్న నాగేష్,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు అభినందించారు.

# శివ కళ్యాణ మహోత్సవం



**కరీంనగర్ జిల్లా స్టాపర్ ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** శివరాత్రి సందర్భంగా శివ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి శివాలయంలో నిర్వహించారు. శివ కళ్యాణ తదనంతరం సుమారు 200 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ వివన్ కే సి జి యఫ్ మడిశెట్టి ఉమాదేవి, క్లబ్ అధ్యక్షురాలు వి ఎన్ గంప హరిణి, మరియు కమిటీ సభ్యులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కట్ట రాంపూర్ డివిజన్ అభివృద్ధికి సహకరించండి

**10వ డివిజన్ కార్పొరేటర్ కొమరయ్య సొగాని.**



**కరీంనగర్ జిల్లా స్టాపర్ ఫిబ్రవరి 17 (హంస కలంన్యూస్):** కట్ట రాంపూర్ నుండి ప్రజాశీర్వాదంతో ఎన్నికైన కొమరయ్య సొగాని స్థానిక డివిజన్ ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ తనను గెలిపించిన డివిజన్ ప్రజలకు,కార్యకర్తలకు,వివిధ కుల సంఘాల పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కరీంనగర్ పట్టణ ప్రజలు సొగాని కొమరయ్య మేయర్ అవుతారని ఆశించారు. కానీ అనివార్య కారణాల వల్ల కాలేకపోయారు. తాను ఏమాత్రం కుశించేది లేదని తాను శక్తివంచన లేకుండా డివిజన్ అభివృద్ధితో పాటు కరీంనగర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే స్మార్ట్ సిటీగా కరీంనగర్ అభివృద్ధి చెందుతున్న దశలో రాంపూర్ డివిజన్ మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.అధ్వానంగా మారిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, లైటింగ్ లాంటి సమస్యలతో డివిజన్ ప్రజలు నిత్యం చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీనికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అధికంగా నిధులను కేటాయించి డివిజన్, కరీంనగర్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు.సమావేశంలో కార్పొరేటర్ కొమరయ్య గారిని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు , వివిధ కుల సంఘాల పెద్దలు, ఆత్మీయులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు, మిత్రులు శ్రేయోభిలాషులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ డిపాజిట్లు అదుర్స్ ప్రవాస భారతీయులకు కలిసొస్తున్న రూపాయి పతనం

**ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో 12 బిలియన్ డాలర్లు**



రూపాయి పతనం ప్రవాస భారతీయులకు కలిసొస్తున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రోజుకొక కనిష్ఠ స్థాయికి పడిపోతుండటంతో విదేశాల్లో స్థిరపడిన భారతీయులు దేశీయంగా భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. ఇక్కడ కూడా రియల్ ఎస్టేట్ రంగం అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రత్యామ్నాయాల్లో భాగంగా డిపాజిట్లకు మొగ్గుచూపుతున్నారని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలల్లో(ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) ఏకంగా 12 బిలియన్ డాలర్ల విలువైన డిపాజిట్లు చేశారు. వీటిలో ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్(ఎఫ్‌సీఎన్ఆర్) డిపాజిట్లు, నాన్-రెసిడెంట్ ఎక్స్‌టర్నల్(ఎన్ఆర్ఈ) డిపాజిట్లు, నాన్-రెసిడెంట్ ఆర్డినరి(ఎన్ఆర్‌వో) డిపాజిట్లు ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో చేసిన 6.11 బిలియన్ డాలర్ల డిపాజిట్లతో పోలిస్తే రెండు రెట్లు పెరిగాయి. దీంతో అక్టోబర్ 2024 చివరినాటికి ఎన్ఆర్ఐ డిపాజిట్లు 162.69 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాది ఇది 143.48 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక అక్టోబర్ నెలలోనే ప్రవాస భారతీయులు బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు పెట్టడం విశేషం. వీటిలో అత్యధికంగా ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ల రూపంలో వచ్చాయని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. ఏడాది క్రితం 2.06 బిలియన్ డాలర్లు రాగా, ఈసారి మూడింతలు పెరిగి 6.1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపింది. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో కూడిన డిపాజిట్లకు అత్యధిక మంది ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపుతున్నారని, ఈ డిపాజిట్లు కూడా విదేశీ కరెన్సీ రూపంలో చేస్తుండటం విశేషం.

### 15 ఎ రూ.26,999కే ఐఫోన్


## 15.. ఫ్లిప్‌కార్ట్ బంపర్ ఆఫర్..!



15 ఎ ఐఫోన్ ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. దీంతో కొందరు బెస్ట్ డిస్కౌంట్స్ కోసం ఎదురుచూసి వాటిని సొంతం చేసుకుంటుంటారు. అలాంటి వారికి ఓ గుడ్ న్యూస్. గతేడాది మార్కెట్‌లోకి వచ్చిన ఐఫోన్ 15 (128)పై ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఊహించని డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఈ ఫోన్‌ను రూ.27వేలకే అందిస్తోంది. సాధారణంగా 15 128+ ధర రూ.69,990. ఈ ప్రీమియం డివైజ్ ఇప్పుడు పలు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను కలుపుకుని కేవలం రూ. 26,999కే ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. అందుకోసం మనం ఐఫోన్ 14ను ఎక్స్ఛేంజ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ. 26,999కే మీ సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. అంతేకాదండోయ్.. దీనిపై ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్' డెలివరీ సేవను కూడా అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో కేవలం 14 నిమిషాల్లోనే ఈ ఫోన్‌ను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఇందుకోసం అదనపు ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఆఫర్ డిసెంబర్ 20 నుంచి 25 వరకు మాత్రమే అందుబాటులో ఉంది. నేటితో ఈ ఆఫర్ ముగియనుంది. ఐఫోన్ 15 గతేడాది (2023) సెప్టెంబర్‌లోలో విడుదలైన విషయం తెలిసిందే. బ్లాక్, బ్లూ, గ్రీన్, పింక్, ఎల్లో రంగుల్లో లభిస్తుందీ ఫోన్. ఐఓఎస్ 17 వర్షన్‌పై పని చేస్తున్న ఐ-ఫోన్ 15 ఫోన్.. ఆపిల్ ఏ16 బయోనిక్ చిప్ కలిగి ఉంటుంది. 6.1 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ ఓలెడ్ స్క్రీన్, డైనమిక్ ఐలాండ్ వంటి ఫీచర్లు ఉంటాయి.


### పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల ట్రెండ్

## 33శాతం పెరిగిన యూపీఐ క్యూఆర్ లావాదేవీలు




ఈ ఏడాది సెమీ అర్బన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రిటైల్ షాపుల్లో యూపీఐ క్యూఆర్ లావాదేవీలు 33శాతం పెరిగాయి. దేశంలో డిజిటల్ చెల్లింపుల ట్రెండ్ పెరుగుతుందనడానికి ఇదే నిదర్శనమని పేనియర్‌బై విడుదల చేసిన నివేదిక చెబుతున్నది. వ్యాపార రుణాలు, వ్యక్తిగత బంగారం రుణాలు, ఈ ప్రాంతాల్లో సులభ నిబంధనలపై రివాల్వింగ్ ఇచ్చిన రుణాలతో సహా రుణ ఉత్పత్తుల్లో 297శాతం పెరుగుదల నమోదైంది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక, డిజిటల్ సేవలు అందిస్తున్న 10లక్షల కంటే ఎక్కువ చిన్న రిటైలర్ల నుంచి సేకరించిన వాస్తవ లావాదేవీల డేటా ఆధారంగా నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం.. బీమా పాలసీ కొనుగోలు, ప్రీమియం సేకరణ కోసం యూపీఐ క్యూర్ లావాదేవీల సంఖ్య ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 127 శాతం పెరిగింది. అలాగే, కొత్తగా 96శాతం వినియోగదారులు పెరిగారు. పేనియర్ బై ఎండీ-సీఈవో ఆనంద్ కుమార్ బజాజ్ మాట్లాడుతూ బీమా, ఈ కామర్స్, రుణాలు తదితర సేవలు అందించేందుకు అవసరమైన సాధనాలను అందించడం ద్వారా స్థానిక రిటైలర్లకు సాధికారత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రో ఏటీఎంలు, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ నుంచి నగదు ఉపసంహరణలు ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయి. అలాగే, పీఎం కిసాన్ వంటి పథకాల కింద నగదుల బదిలీ సమయంలో ఏఈపీఎస్ ద్వారా నగదు ఉపసంహరణలు 35-45శాతం పెరిగాయి. జమ్మూ కాశ్మీర్‌లో నగదు విత్‌డ్రాలు 74 శాతం పెరిగాయి.

## ఓలా ఒకేరోజు 3,200 స్టోర్లు




ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన సంస్థ ఓలా స్పీడ్ పెంచింది. ఒకేసారి దేశవ్యాప్తంగా 3,200 అవుట్‌లెట్లను తెరిచింది. దీంతో మొత్తం అవుట్‌లెట్ల సంఖ్య 4 వేలకు చేరుకున్నాయి. కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో మెట్రో, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సైతం స్టోర్లను ప్రారంభించినట్లు ఓలా ఎలక్ట్రిక్ సీఎండీ భావిశ్ అగర్వాల్ తెలిపారు. దీంట్లోభాగంగా హైదరాబాద్‌లోనూ స్టోర్‌ను ప్రారంభించింది. సర్వీస్ సెంటర్ కలుపుకొని ఏర్పాటు చేసిన ఈ స్టోర్లలో పూర్తిగా ఆధునీకరించినట్లు చెప్పారు.

# మీ దీపాన్ని ఆరనివ్వరు




'అనాయాసేన మరణం.. వినా దైన్యేన జీవితం..' అని భగవంతుడిని కోరుకుంటారు చాలామంది. రోగాల పాలై, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ.. దుర్భరమైన మరణం రావొద్దని దైవాన్ని ప్రార్థిస్తారు. ఎన్ని ఆరోగ్య సూత్రాలు పాటించినా.. అవసాన దశలో శరీరానికి ఏవో రుగ్మతలు రావడం ఖాయం. ఎవరో అదృష్టవంతులు రాత్రికి రాత్రి నిద్రలో కన్నుమూస్తారు! వృద్ధాప్యంలో ఎవరికీ భారం కాకుండా, ఎవరినీ దేహీ అనకుండా జీవితం సాగాలంటే మాత్రం అది మీ చేతుల్లోనే ఉంది. వయసులో ఉన్నప్పుడు ముందుచూపు లేకుండా వ్యవహరిస్తే.. ముదిమి వయసులో దేవుడు కూడా మిమ్మల్ని ఉద్ధరించలేడు. రిటైర్మెంట్ ప్లాన్ కచ్చితంగా చేసుకుంటే.. అనాయాసేన మరణం మాటేమిటో గానీ, వినా దైన్యేన జీవితానికి మాత్రం గ్యారెంటీ లభిస్తుంది. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు మనిషి జీవితం రాజమౌళి సినిమాలా కలర్‌ఫుల్‌గా అనిపిస్తుంది. వయసు పైబడే కొద్దీ.. ముగింపు లేని డైలీ సీరియల్‌లా భారంగా సాగుతుంది. జీవిత చరమాంకం కూడా సూపర్‌హిట్ కావాలంటే.. రిటైర్మెంట్ ప్లాన్ పక్కాగా ఉండాలి. మీ శేష జీవితాన్ని విశేషంగా గడపాలంటే.. ఇబ్బడిముబ్బడిగా ఆస్తులు కూడబెట్టడం కాదు! నెలకు లక్ష రూపాయల దాకా పెన్షన్ వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటే% గడ్డాల నాడు కూడా బిడ్డలు మీ మాటలు వింటారు. ఇప్పుడంటే లక్ష వస్తే సరిపోతుంది. ఇప్పుడు మీరు ముప్పయ్‌లో ఉంటే మాత్రం ఈ లెక్క సరిపోదు. మీకు అరవై వచ్చేనాటికి నెలనెలా కచ్చితంగా రూ.2 లక్షలు మీ ఖాతాలో పడితేగానీ.. ప్రశాంత జీవితం గడిపే ఆస్కారం ఉండదు. కొత్త పెన్షన్ విధానంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ తర్వాత కచ్చితమైన పెన్షన్ వచ్చే అవకాశం లేకుండా పోయింది. ప్రైవేట్ ఉద్యోగుల సంగతి సరేసరి. ఏ ఉద్యోగం చేస్తున్నా అరవై దాటాక నెలకు కనీసం రూ.లక్ష వచ్చేలా పెన్షన్ ప్లాన్ చేసుకోవడం చాలా అవసరం. మీరు, మీ తదనంతరం మీ జీవిత భాగస్వామికి కూడా అంతే మొత్తం పెన్షన్ వచ్చేలా ప్లాన్ తీసుకోవాలి. నలభై ఏండ్ల వ్యక్తి% నెలకు కనీసం రూ.20 వేల చొప్పున ఎస్ఐపీ కడితే.. రిటైర్మెంట్ నాటికి అది దాదాపు రూ.2 కోట్లకు చేరుతుంది. అప్పుడు ఆ మొత్తాన్ని ఇతర పెట్టుబడి సాధనాల్లో మేలైన దాన్ని ఎంచుకొని ఇన్వెస్ట్ చేసి.. ప్రతినెలా మీకు గ్యారెంటీగా పెన్షన్ వచ్చేలా చూసుకోవాలి. స్పష్టంగా చెప్పాలంటే% రిటైర్ అయ్యాక మీరు బంగారు గుడ్డు పెట్టే బాతులా ఉండాలన్నమాట. అంటే మీరున్నంత కాలం ఆదాయం రావాలి. మీరు పోతేనే ఆదాయం వచ్చేపనైతే.. సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. కూడబెట్టిన సొమ్మును ఒక్కసారిగా తీసుకోకుండా.. నెలవారీగా వచ్చే ఏర్పాటు చేస్తే.. మీ లెవల్ మరోలా ఉంటుంది.

### పైసా మే పరమాత్మ..

ఈ మాటలు కాస్త కఠినంగా అనిపించినా, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుంటేనే తెలివైన వారు అనిపించుకుంటారు. మానవ సంబంధాలన్నీ ఆర్థికం చుట్టూనే తిరుగుతున్నాయి. నెలకు ఎలాంటి ఆదాయం లేకుండా, కేవలం ఆస్తులు మూటగట్టుకొని ముసలితనంలోకి ప్రవేశిస్తే ఆశించిన ఆదరణ దక్కకపోవచ్చు. 'ముసల్ది, ముసలోడు ఎప్పుడు పోతారో!?' అని గోతికాడ నక్కల్లాగా ఎదురుచూస్తుంటారు వారసులు. అదే మీరు కామధేనువు అయితే! అంటే, మీరు బతికి ఉన్నంతకాలం నెలనెలా పెన్షన్ వస్తుందంటే మాత్రం మీ ప్రాణం అదే వారసులకు అపురూపంగా మారుతుంది. ఆస్తుల కోసం హత్యలు చేసే కిరాతకులు కూడా.. పెన్షన్ సొమ్ముకోసం తల్లిదండ్రులను నెత్తిన పెట్టుకొని చూసుకుంటారు. మీకు తిండి పెట్టకపోయినా, మంచి బట్ట కట్టకపోయినా.. మీ మనసు వికలం చెంది ప్రాణానికే ప్రమాదం రావొచ్చని కంగారుపడతారు. పొద్దునే కొడుకు గుడ్ మార్నింగ్ చెబుతాడు. 'తాతయ్యా, బామ్మా బై!' అంటూ మనవలు బడికి దారితీస్తారు. 'ఏం టిఫిన్ చేయమంటారు అత్తయ్యా' అని కోడలు మీ సలహా కోరుతుంది. 'పైసా మే పరమాత్మా హై' అంటే ఇదే!

### ఆయుష్షు పెంచుతారు

ఒక్కమాటలో చెప్పాలంటే.. వాళ్ల చేతులు కాలినా మీ దీపాన్ని ఆరనివ్వరన్నమాట. ఒంట్లో నలతగా ఉందంటే చాలు.. హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్తారు. బైపాస్ సర్జరీ చేయిస్తారు. ఇద్దరు కొడుకులు ఉంటే స్టంట్లు నేను వేయిస్తానంటే నేను వేయిస్తానంటూ స్టంట్లు చేస్తారు. ఓ లక్ష ఆసుపత్రి బిల్లు కట్టి మీ ఆయుష్షును పెంచితే.. మరో రెండేండ్లు పెద్ద ప్రాణం ఉంటుందని వారి నమ్మకం. ఆ రెండేండ్లూ నెలకు లక్ష వస్తుందనే ఆశ. ప్రస్తుతం మనదేశంలో పెన్షన్ అందుకుంటున్న వారిలో వందేండ్ల పైబడినవారు ఆరువేల మంది వరకు ఉన్నారు. వీళ్లకు ప్రతినెలా వస్తున్న పెన్షన్ లక్షకు పైనే! ఆ వారసులు వీళ్లను ఎంత ఆరోగ్యంగా చూసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. అందరూ అలా ఉంటారని కాదు! ఈ రోజుల్లో కాసులకే విలువ ఇచ్చేవాళ్లు చాలామంది కనిపిస్తున్నారు. మరో పాతికేండ్లకు ఇంటింటా ఈ తరహా వ్యక్తి ఉండొచ్చు. వారి దురాశే.. పెన్షనర్‌కు శ్రీరామ రక్ష!



# బీమాకు తగ్గుతున్న గిరాకీ ఏటేటా పడిపోతున్న కొత్త పాలసీ కవరేజీలు

**2023-24లో 4 నుంచి 3.7 శాతానికి క్షీణించిన వృద్ధి**

**ఐఆర్‌డీఏఐ వార్షిక నివేదికలో తేటతెల్లం**



ఓవైపు దేశంలో 'అందరికీ బీమా' లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (ఐఆర్‌డీఏఐ) ముందుకెళుతుంటే.. మరోవైపు ఏటేటా పాలసీలు తీసుకునేవారి సంఖ్య క్షీణిస్తున్నది. 2047కల్లా ప్రతీ భారతీయునికి బీమా ఉండాలన్నది బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ ఆశయం. కానీ గత రెండు ఆర్థిక సంవత్సరాల తీరును చూస్తే.. ఇది నెరవేరడం అంత ఈజీ కాదని స్పష్టమైపోతున్నది. అవును.. ఐఆర్‌డీఏఐ 2023-24 వార్షిక నివేదికలోని వివరాలను చూస్తే ఇంతే మరి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ (జీడీపీలో వార్షిక ప్రీమియంల నిష్పత్తి) 3.7 శాతానికి పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 4 శాతంగా ఉండటం గమనార్హం. ఇక 2021-22లోనైతే 4.2 శాతంగా నమోదైంది. దీంతో ఏండ్లు గడుస్తున్నకొద్దీ కొత్త పాలసీలు అంతకంతకూ పడిపోతున్నాయన్నమాట. ఏటేటా ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేస్తున్న బీమా ప్రీమియంల ఆధారంగా ఈ బీమా పెనెట్రేషన్‌ను అంచనా వేస్తారన్న విషయం తెలిసిందే.

### జీవిత బీమాలో..

జీవిత బీమాను తీసుకోవడంలో చాలామంది అంతగా ఆసక్తి చూపట్లేదని తాజా ఐఆర్‌డీఏఐ రిపోర్టు ఆధారంగా తేటతెల్లమవుతున్నది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన సంవత్సర కాలంలో లైఫ్ ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ వృద్ధిరేటు 2.8 శాతానికి తగ్గుముఖం పట్టింది. అంతకుముందు ఏడాదిలో ఇది 3 శాతంగా ఉన్నది. ఇక నాన్-లైఫ్ కవరేజీలు 1 శాతంతో స్థిరంగా ఉన్నాయి. దీంతో దేశంలో బీమా వ్యాప్తికి మరింతగా కృషి చేయాలని బీమా రంగ సంస్థలకు ఐఆర్‌డీఏఐ పిలుపునిచ్చింది. వచ్చే 23 ఏండ్లలో (2047 నాటికి) దేశంలోని మొత్తం జనాభాకు బీమా సదుపాయం ఉండేలా శ్రమించాలన్నది.

### పెరిగిన తలసరి ప్రీమియం

గత ఆర్థిక సంవత్సరం తలసరి బీమా ప్రీమియం 95 డాలర్లకు పెరిగింది. అంతకుముందు ఇది 92 డాలర్లే. నాన్-లైఫ్ ఇన్సూరెన్స్‌లో 22 నుంచి 25 డాలర్లకు పెరగగా.. లైఫ్ ఇన్సూరెన్స్‌ల్లో 70 డాలర్లుగానే ఉన్నది. కాగా, 2016-17 నుంచి ఏటా తలసరి బీమా ప్రీమియంలు పెరుగుతూనే ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ చెప్తున్నది. ఇదిలావుంటే గత ఏడాది ప్రపంచ బీమా నమోదులో వృద్ధి 7 శాతంగా ఉన్నది. జీవిత బీమాలో 2.9 శాతంగా, జీవితేతర బీమా పాలసీల్లో 4.1 శాతంగా ఉన్నట్టు అంచనా. ఇక 2023లో ప్రపంచ తలసరి బీమా ప్రీమియం 889 డాలర్లుగా ఉన్నది. అమెరికా, దక్షిణ కొరియా, బ్రిటన్‌లలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ వరుసగా 11.9, 11, 9.7 శాతాలుగా ఉన్నాయి. దక్షిణాఫ్రికాలోనూ 11.5 శాతం నమోదవడం విశేషం. నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీలో 2023-24కుగాను క్లెయిముల నిష్పత్తి స్వల్పంగా తగ్గినట్టు ఐఆర్‌డీఏఐ తెలిపింది. 82.52 శాతంగా ఉందన్నది. 2022-23లో ఇది 82.95 శాతంగా ఉన్నది.

### పసిడి పరుగో పరుగు ఏడాదికాలంలో

# 30 శాతం వరకు పెరిగిన ధరలు



**2025లో పెద్దగా మార్పుండదంటున్న విశ్లేషకులు**

బంగారం ధగధగ మెరుస్తున్నది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ప్రస్తుతేడాది ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దీంతో గడిచిన ఏడాదికాలంలో బంగారం, వెండి ధరలు 30 శాతం వరకు పెరిగాయి. అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుండటం, పశ్చిమాసియా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు కారణంగా ఈ ఏడాది ధరలు భారీగా పెరిగాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు దేశవ్యాప్తంగా రూ.76 వేల నుంచి రూ.78 వేల స్థాయిలో ఉన్నాయి. కానీ, వచ్చే ఏడాది తులం పుత్తడి ధర రూ.81 వేల స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పుత్తడితోపాటు వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో పాటు ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెళ్లు, హెల్త్‌కేర్, ఎలక్ట్రిక్ వాహనాల్లోనూ వెండి వాడకం భారీగా పెరిగింది. సరఫరా-డిమాండ్ మధ్య వ్యత్యాసం అధికంగా ఉండటం కూడా ధరలు పెరగడానికి కారణమని వారు అంటున్నారు.

### ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించడం

ఫెడరల్ రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను క్రమంగా తగ్గించడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా కారణమన్నారు. యూఎస్ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మళ్లీ గెలవడంతో వ్యాపార అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నట్లు వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలుతుండటం కూడా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను సురక్షితమైన గోల్డ్‌వైపు మళ్లించారు. గడిచిన రెండు నెలల్లో ఈక్విటీ మార్కెట్లు 11 శాతం వరకు నష్టపోయాయి. అలాగే పలు దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 500 టన్నులకు పైగా బంగారాన్ని కొనుగోలు చేశాయి.

**ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

**అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం**

**అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి జారుకోవడం**

**పెట్టుబడిదారులు ఈక్విటీల కంటే అతి విలువైన లోహాలకు మొగ్గుచూపడం**

**క్రమంగా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా..**

**మధ్య తూర్పుదేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడం ..**